కేరమ్ బోర్డు

"గరమ్, గరమ్" అంటూ వేడి వేడి వేరుశనగపప్పు అమ్మే వాడు సహితం సముద్రతీరంలో ఎక్కడా కనబడలేదు. రవణ ముడుచుకు కూర్చున్నాడు. శరీరం జిల్లుమనిపించే చలి, సముద్రతరంగాల హోరు తప్ప ఇంకేం వినబడ్డంలేదు. ఏచి అంతా ఖాళీఅయిపోయింది.

నాకుమాత్రం హుషారుగానే వుంది లోపల శరీరాన్ని పట్టి ఉన్ని స్వెట్టరు, చెవులచుట్టూ మఫ్లరుతగిన వెచ్చదనాన్ని కలిగిస్తున్నాయి.

హార్బరు కాలువలో డ్రెడ్జరు బుర్రుమని బిగులు వేసింది. ఏడున్నర దాటినట్లుంది. రవణ మోకాళ్లకు గెడ్డాం ఆనించి లైటుహౌసు మీది గోపురాలను తిలకిస్తూ దీర్ఘాలోచనలో పడ్డాడు. చలి. ఇంటికి పోదామనడంలేదు. వాడినేదో వేధిస్తున్నాది. క్షణ క్షణానికీ వాడి హావభావాల్లో మార్పు కనబడుతున్నది.

తలదువ్వక నిర్లక్ష్యంగా జుత్తు చిందరవందర చేసుకున్నా, లేత వయస్సులో లేలేత వంకాయలాంటి ముఖంతో రవణ చక్కని కుర్రవాడు. ఎవరినైనా ఆకర్షిస్తాడు. చూసీ చూడ్డంతోనే వాడిమీద నాకు ఎక్కడలేని తనవాడి తనం వచ్చి ఆపేక్షకలిగింది. వాడిభోగట్టా ఇంకా నాకేం తెలియదు. కుర్రవాడు చాకులాంటివాడు. బీచి మీద కలిశాడు. ఎందుకు ఆగమ్మ కాకిలాగ తయారయాడో మాత్రం తెలియలేదు.

"రవణా, ఇహ లేద్దామా?" అని నేనే అడిగాను.

"కూర్చుందురూ" అన్నాడు.

పసిపిల్లలకీ పందిరిరాటలకీ చలి వెయ్యదంటారు, ఇదే కాబోలు!

"పదా, భోజనం చేద్దాం. వేళైంది" అన్నా.

"ఐతే పదండి. నేనూ రీడింగు రూముకి పోతాను."

"ఇప్పుడు మళ్లానా?"

పూసపాటి కృష్ణంరాజు

"ఒక్క గేము ఆడేసి ఇంటికి పోతాను. భోంచేసి మీరూ రండి నా ఆట చూద్దురు గాని. నాతో అక్కడ ఒక్కడూ ఆడలేడు. మళ్లా వాళ్ళంతా సంవత్సరాల బట్టి ఆడుతున్నారు. నేను ఆట మొదలెట్టి గట్టిగా రెండునెల్లు కాలేదు. అందరికీ నేనంటే హడలే" అలా వల్లించేస్తున్నాడు ఉత్సాహంతో.

"నీ ఆట తప్పకుండా చూస్తాలే. ముందు పద చలిగాలికి న్యూమోనియా రాగలదు" అని వాణ్ణి తట్టి లేపి హోటలుకు బయలుదేరేను.

శివాలయం వీధిలోంచి మెయిన్ రోడ్డు చేరాము. కాకాహోటళ్ళలోని పాత గ్రామఫోను సంగీతం కర్ణకఠోరంగా పెంటాడుతున్నది. మెయిన్ రోడ్డున కూడా జనసంచారం బాగా తగ్గిపోయింది చలి సామాన్యంగా లెదు. బిచిని అంత సేపూ నేనైతే వెచ్చని కాఫీ తాగి, వెచ్చని దుస్తులతో కూర్చోగలిగాను, సిగరెట్లసహాయంతో రవణ వాడికన్నా కాస్త పెద్దవాణ్ణని సందేహించి కాల్చలేక పోయాడో! లేక నిజంగా కాల్చడో! సిగరెట్టు కాల్చననే చెప్పాడు.

ఆ చలిలో నిక్కరు, పొట్టిచేతుల బుష్ కోటు, లోపల బనీనైనా లేకుండా వున్నా ఎలాగంత సేపు సముద్రపు రొజ్జలో కూర్చున్నాడో నాకు ఆశ్చర్యంగానే వుంది. "ఈవాళ మనిద్దరం హోటల్లో భోం చేద్దాం" అన్నాను.

"ఒద్దండీ, ఎందుకూ డబ్బుదండగ" అన్నాడు.

"ఫరవా లేదు లే."

"రీడింగురూముకి పోతానండి. ఒక్క బెట్టు కొట్టేసనంటే బేడ వుడాయిస్తాను."

"ఇవ్వాల్టికి రా" అని బలవంతంగా హోటలుకి నెట్టుకుపోయాను. భోంచేసి ఇద్దరం బయటకొచ్చాము. ఇంకా రీడింగురూము కోలాహాలంగానే వుంది.

"ఏయి రవణా, కేరంబోర్డు ఆడతావా?" అన్నాను.

"ఆడనండీ" అన్నాడు.

"అదేమిటి, ఆడతానన్నావు? నన్ను చూడమన్నావు వెయ్యి ఒక గేము."

"ఇహ నేను కేరమ్‌బోర్డు ముట్టుకుంటే ఒట్టు" అని శపథం చేశాడు. అప్పటికప్పుడే అంతమార్పు ఎందుకు వచ్చిందో! అంతా చంచల చిత్తం కుర్రవాడు, ఇంకా-మానసిక నిశ్చలత రాలేదు.

"అలాగ నిన్ను వదులుతానా.

నీ ఆట చూడనిదే ఇవ్వాళ నేను లాడ్జికి వెళ్ళను."

"ఒద్దండీ, బెట్టు వెయ్యందీ వాళ్లు ఆడనివ్వరు. నా దగ్గర బేడ డబ్బులేనా లేవు. పో నిద్దురా" అన్నాడు.

"నే నిస్తాను పద" అని వాణ్ణి గెంటుకొని రీడింగురూములో ప్రవేశించాను.

"ఏమిరా, ఆడతావా? పొద్దున్నలాగనుకున్నావు కాబోలు. ఆ పప్పు ఉడకదు. బేడ బేడ పందెం" అన్నాడు ఒక వుంగరాల జుత్తులతను ఛాలెంజి చేస్తూ ముందుకు వచ్చాడు. కేరమ్‌బోర్డులు నాలుగైదు చోట్ల ఆడుతున్నారు.

"రా, బస్తీమే సవాల్" అని గబగబా కోడిపుంజులాగ వెళ్లేడు.

వుంగరాల జుత్తువాడు, రవణా కొత్త టేబిలుదగ్గర కూర్చుని ఆట ప్రారంభించారు. ప్రక్కని కుర్చీలో కూర్చుని చూస్తున్నాను. ఆట ప్రారంభంనుండి చూడ్డానికి ముచ్చటగా వుంది. చాలా నీటుగా రవణ పాయింట్లు తీస్తున్నాడు. నసుగు లేకుండా, గురి చూసుకోడానికి వేళ్లు సవరింపైనా లేకుండ చక చక కొడుతున్నారు. రెండు చేతులా ఒక్కలాగ ఆడుతున్నాడు. బోర్డు రెండోసారి తనకి ఆట రాగానే అయిపోయింది. రెడ్డుతో సహా ఏడు మార్కులు రవణ కొట్టేశాడు.

ఆశ్చర్యం! రవణా, వుంగరాల జుత్తువాడు ఆట ప్రారంభించగానే బోర్డు చుట్టూ ఆట చూడ్డానికి రీడింగురూములో వున్న కేరమ్ బోర్డు ఆటగాళ్ళంతా వలయంకట్టి కిక్కిరిసిపోయారు. వాళ్లంతా గుమి

"ఇహ నేను కేరమ్‌బోర్డు ముట్టుకుంటే ఒట్టు" అని శపథంచేశాడు.

గూడడం నా చైతన్యంలో లేకుండానే అయింది. రవణ ఆట నన్ను మైమరపించేసింది. ఉంగరాల జుత్తువాడిదగ్గర బేడ రవణ వుడయించాడు. ఇద్దరంకలిసి బైటికి వచ్చేసరికి పది దగ్గర అవుతున్నది.

"మీ ఇల్లు ఎక్కడ?" అడిగాను.

"అబ్బో, చాలాదూరం అల్లీపురం."

"ఇప్పుడు కాళ్ళీడ్చుకుంటూ నడిచిపోగలవా? మా లాడ్జికి వచ్చేయి. పొద్దున్న వెళుదువుగాని" అన్నాను. "అంతకన్నా నా, పదండి" అని నాతో వచ్చేశాడు.

సరికొత్త స్నేహితుడు. బీదివి

కేరమ్ బోర్డు

రెండుమాటలు కలిశామో లేదో అంత జోస్తీ రెండుమూడు రోజుల్లోనే ఏర్పడిపోయింది.

లాడ్జి తలుపుతీసి స్విచ్చి నొక్కి హోల్డాలును ఒక్క కిక్కుతన్నేను. పరుపుచుట్ట విడి యథాస్థానాన్ని పరచుకొంది. అందులో జంబుఖానా పైకితీసి ఒక తలగడా తీసి రవణకిచ్చాను. బీచిని చాలసేపు చలిలో వుండడాన్నేమో గదిలో వెచ్చదనం తగలగానే నడుం వాల్చాలనిపించింది.

"రవణా, నువ్వు చక్కగా పాడతానన్నావు. పాట విందామనే వుంది. కాని కునుకు వచ్చేస్తున్నాది." అని లుంగీ వేసుకున్నాను. రవణ జంబుఖానా పరుచుకొని బోర్లా పడుకున్నాడు. తలగడా మీద మొహంపెట్టుకొని వలవల ఏడుస్తున్నట్లు కనబడ్డది.

"రవణా, ఏయ్ రవణా" పిలిచాను. నిస్సందేహంగా రవణ ఏడుస్తున్నాడు.

"ఏమోయ్, ఎందు కేడుస్తున్నావ్ ?" వాడు జవాబు చెప్పలేదు. వెక్కుతున్నాడు. నాకు అర్థంఅయింది. కుర్రవాడు. చెప్పకుండా చెయ్యకుండా రాత్రి తిండికైనా వెళ్ళకుండా వుండిపోతే చీవాట్లు వస్తాయి. నేను చేసింది పొరబాటే. వాడిని దూరమైనా సరే ఇంటికి పొమ్మనాల్సింది. ఇంతకీ మించిపోయింది లేదు.

"రవణా, నువ్వు ఇంటికి పో. నిజమే మీవాళ్లు చీవాట్లు పెడతారు. ఎక్కడి కెళ్ళావో తెలియక బెంగ పెట్టుకుంటారు. ఒక్కడివీ వెళ్ళగలవా, తోడు రమ్మన్నావా?" అని అడిగాను. వాడు చటుక్కున లేచాడు.

"ఎవ్వరూ నాకోసం బెంగపెట్టుకోరు. భోజనానికి వెళ్ళకపోతేనేం, వెళితేనేం. ఇంటిదగ్గిర అన్నం ఒకటి ఈరాత్రి వొండేరో లేదో! మీ ధర్మమా అని కడుపునిండా నేను అన్నంతిన్నాను. ఇంటికెళితే పస్తు పడుకుందునేమో. నేను రాత్రిళ్లు ఎగవెయ్యడం ఇది మొదటిసారి కాదులెండి" అన్నాడు.

నాకు ఎక్కడలేని విచారం ముంచుకొచ్చింది.

"ఐతే ఎందు కేడుస్తున్నావు ?"

"మా ప్రారబ్ధానికి. మా నాన్న ఉద్యోగంపోయింది. పడరాని కష్టాలు పడుతున్నాం. నా చదువు ఎగనామం పెట్టేసింది. ఎక్కడా ఉద్యోగం అయినా దొరకడం లేదు. ఈ రాత్రి నేను కడుపునిండా కూరలు, పచ్చళ్లు, పులుసు, పెరుగు వేసుకొని భోంచేశాను. అందుకు దుఃఖం వొచ్చేసింది. ఆపుకోలేకపోయాను" అని బుగ్గలనిండా నీళ్లు కార్చుకుంటూ కూర్చున్నాడు.

రెండురోజులై బీచిలో కలుస్తున్నాడు. అంత బాధపడుతున్నవాడిలాగ నాకు కనబడలేదు. నిర్విచారంగా కిలకిల నవ్వుతూ, నిశ్చింతగా, కోమలంగా, అమాయకంగా ఏ బాధాబందీలేని కుర్రవాడుగానే నాకు కనబడ్డాడు. కేరమ్‌బోర్డు ఆడుకుంటూ చదువూ సంధ్యా పాని తెలివితేటలుండీ చెడిపోతున్న కుర్రవాడని అనుకున్నాను. కాస్త దారిలో పెడదాము, పెడమార్గం తప్పిద్దాం అనికూడా అనుకున్నాను. కథంతా అడ్డంతిరిగింది.

"రవణా, ఏడవకు నన్ను చూస్తున్నావా ? నేను నీకన్నా ఎక్కువ కష్టాలుపడ్డాను. నీకు తలిదండ్రులున్నారు. బాధలు వాళ్ళు పడతారు. ఇంతకీ స్కూలుఫైనలు పాసయ్యావు. ఎక్కడో ఏదో చూసుకుంటావు. కొంచెం ఓరిస్తే కాలం తిరగబడుతుంది. పడుకో. పొద్దున్న నీకు చిన్న ఉద్యోగం వస్తుందేమో చూద్దాం" అన్నాను. అన్నానుకానీ కష్టమే. నాకే సరియైన ఉద్యోగంలేదు. ఉంటుందో వూడుతుందో తెలియని కొలువు చేస్తున్నాను.

"ఎందుకు మీరు బాధపడతారు, ఏప్పుడో ఒకనాడు ఏరాత్రి కొండ ఎక్కి ఒక్కదూకు దూకేస్తాను. పీడ పూర్తిగా వొదిలిపోతుంది" అన్నాడు నా ప్రాణం చివుక్కుమంది.

"తప్పు రవణా. చెప్పేనుగా కష్టాలు కొనవరకూ వుండవు. కాస్త పస్తాయించాలి. పడుకో. పొద్దున్న చూసుకుందాం కదూ—" అని ఓదార్చి పడుకోబెట్టాను.

ఆ రాత్రంతా నేను సరిగా నిద్రపోలేదు. ముసుగు తన్ని పడుకొన్నాను. కాని కళ్లు మూతలు పడలేదు. బాగా తెలివొచ్చిచూస్తే పొద్దున్న ఎనిమిదిగంటలైనట్లుంది. పక్కని రవణ లేదు. లేచిచూస్తే వరండాలోనూ లేదు. తొందరగా

★ కేరమ్ బోర్డు ★

మొహం కడుక్కొని బయటకు బయలుదేరేను. నాకు గట్టిగా అనుమానం పట్టుకుంది. ఈ కుర్రవాడు ఏ అఘాయిత్యమో చేశాడేమోనని నన్ను అనుమానం పీక్కు తింటున్నది. రీడింగురూములోనూ లేడు, పరిసరాల్లోనూ లేడు. వాడికోసమని ఇప్పుడెక్కడని గాలించను!

చటుక్కున ఇంకో ఆలోచన తట్టింది. జేబులో పర్సు చూసుకున్నాను. వుంది. పర్సులో డబ్బు కూడా భద్రంగానే వుంది. ఐతే పర్సు హోల్డాలు లోపలికి తోసేసి పడుకోవడం అలవాటు. అనుమానంతోటి తిరిగి లాడ్జికి వెళ్లేను గదిలో ఖరీదైనబట్టలు, బిగ్ బెన్ను మొదలైనవన్నీ భద్రంగానే వున్నాయి. ఈ వింత ఆలోచనకి నామీద నాకే అసహ్యంవేసింది. పాపం రవణ దొంగకాడు, దొరే!

ఆ సాయంకాలం ఉద్యోగం నుండి తిరిగివచ్చాక రవణకోసం రీడింగురూముకి వచ్చాను. ఆ రోజంతా ఆఫీసులో రవణమీదే మనస్సు. ఏ రాడ కొండమీదనుంచి సముద్రంలోకి దూకుతూ వుంటే అడ్డుకొనేవారు ఎవరూ వుండరు. రీడింగురూములోకి గుండె గడ గడలాడుతూ వెళ్ళేను. ఏ వార్త వింటానో అనే భయం.

లోపలికి వెళ్ళగానే అతి వుల్లాసంగా, నిశ్చింతంగా మైమరచి అక్కడ రవణ కేరమ్సు ఆడుతున్నాడు. పట్టరాని సంతోషం ఉబికింది. "రవణా" అని గట్టిగా అరిచాను. వాడు తలెత్తిచూస్తే జాలిగా కనబడ్డాడు.

"రండీ, పొద్దున్న మీరు నిద్రపోతున్నారు. లేపడం ఇష్టంలేక ఇంటికివెళ్ళేను. క్షమించండి" అన్నాడు. వెంటనే తలదించుకుని, చుట్టూ అతని ఆటని చూసి ఆనందిస్తున్న ప్రేక్షకులనైనా గమనించకుండా ఆటలో పూర్తిగా నిమగ్నమైపోయి స్ట్రైకరుని నిదానంగా పెట్టుకున్నాడు. కళ్ళు పైకెత్తి నావంక జూసి "ఇదిగో, మంచి రసకందాయంలో వుంది. వచ్చేస్తాను వుండండి" అని మళ్ళా పూర్తిగా ప్రపంచాన్ని మరిచిపోయాడు. ★

"ఏరా గోపీ! ఇవ్వాళ సినిమా "దేవదాసు" కదూ!"

"'దేవదాసు' కాదురా పిచ్చిపుల్లయ్య."

"(కోపంతో) ఏమంటున్నావ్!..."

"(నవ్వుతూ) 'పిచ్చిపుల్లయ్య', అంటున్నాను."

—బి. ఆనందరావు, (జయపురం.)

* * *

తల్లి: ఒరేయ్ గోపీ! నీకు ఈసారి చెల్లాయి కావాలా, తమ్ముడు కావాలా?

గోపి: నాకు చెల్లాయి, తమ్ముడూ వున్నారుగా; సోమూలాగ నాకు అక్కయ్యగాని, అన్నయ్యగాని కావాలి.

—పి. హనుమంతరావు—రాజోలు.

సింహసేనాపతి

(35-వ పేజీ తరువాయి)

యింటిలోకి వచ్చివేశాడు. లోపల వడ్డన జోరుగా సాగుతోంది. సేనాపతి స్వయంగా భగవంతునికిఉత్తమ ఖాద్యాలను భోజ్యాలను వడ్డించి సంతర్పితుణ్ణి చేశాడు. భోజనం అయిన తర్వాత. చేతులు కాళ్లు కడుగుకొని భగవానుడు ఆశీనుడైనాడు. తక్కుంగల భిక్షుసంఘం అంతా ఆయన చుట్టు చేరింది. సింహసేనాపతికూడా వేరే ఆసనంమీద కూర్చున్నాడు. భగవానుడు ధార్మికకథా కథనంతో అందర్నీ సంతర్పితులను చేశాడు.

8

ఆ రామం చేరుకొనేదాకా శాక్యముని ఎవరితోను ఏమీ దారిలో మాట్లాడలేదు. ఆరామం చేరుకున్నతర్వాత ఆయన భిక్షుసంఘాన్ని సమావేశ పరిచారు. నిగంఠ జైనవృత్తాంతం ఆయన మనస్సులో ఆడుతూనేవుంది. మాంసాహారాల్ని గూర్చి వారు చేస్తున్న దుష్ప్రచారం భగవానుడికి కష్టం కల్గించింది. సమావేశమైన భిక్షుసంఘాన్ని తిలకించి ఆయన ఈలా అన్నాడు: మీకు ఆయా మాంసాలు ఇష్టం అనిచెప్పి వండించుకు తినకండి. శుద్ధ మత్స్యం యొక్క మాంసం తినడానికి మాత్రం ఆజ్ఞఇస్తున్నాను.

ఈ విధంగా సింహసేనాపతి దీక్ష బుద్ధుని ధర్మానికి ఒక కొత్త శాసనాన్ని సమకూర్చిపెట్టింది. ★